క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

మోమిన్‌పేట: మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డి.వసంత అధ్యక్షతన నిర్వహించబడుతుందని ఎంపీడీఓ శైలజారెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే సమీక్షలో గ్రామాల్లో నెలకొన్న సమస్యల గురించి చర్చించబడుతుందని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ అధికారులు సకాలంలో హాజరుకావాలని చెప్పారు.

కోలుకుంటున్న తహసీల్దార్

యాలాల: మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన తహసీల్దార్ మునీరుద్దీన్ కోలుకుంటున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని నగరానికి వెళ్తున్న క్రమంలో మొయినాబాద్ వద్ద ఆగి ఉన్న లారీని తహసీల్దార్ కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది.

విద్యార్థులకు రక్తహీనత పరీక్ష



విద్యార్థులకు బ్లడ్ టెస్ట్ చేస్తున్న వైద్యులు

ధారూరు: రక్తహీనతతో విద్యార్థులు అనేక రుగ్మతలకు గురవుతున్నారు. ఫలితంగా చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. అలాంటి రక్తహీనతకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'రక్తహీనత ముక్త్ భారత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం ధారూరు మండలం కుక్కింద ఉన్నత పాఠశాలలో మర్పల్లి ఎంహెచ్‌టీ-బీ టీమ్ డాక్టర్ల బృందం విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజాషిండే మాట్లాడుతూ రక్తహీనత ఉన్న విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ రాము, ఏఎన్‌ఎంపీ జ్యోతి, హెచ్‌ఎం రవీంద్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోటళ్లకు డొమెస్టిక్ సిలిండర్ల విక్రయం తగదు

కొడంగల్ రూరల్: సిలిండర్ల కొరత పేరుతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారులను ఇబ్బందులకు గురి చేయడం తగదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నో స్టాక్ పేరుతో సరఫరా సిబ్బంది.. గృహ వినియోగదారులను సకాలంలో బండ అందించకుండా.. డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఇదే విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గుల్షన్ తెలిపారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

చేవెళ్ల: రక్తదానం చేయడం అంటే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని సాగర్ గ్రూప్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ సురేశ్ అన్నారు. ఊరెళ్ల సమీపంలోని సాగర్ గ్రూప్ విద్యాసంస్థలో సోమవారం ఎమ్ఎన్‌జే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, రీజనల్ క్యాన్సర్ సెంటర్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 60 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. సరైన సమయంలో రక్తం అందక ఎంతో మంది చనిపోతున్నారని వివరించారు. రక్తదానం చేయటం వలన ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. ఇందులో ప్రొఫెసర్ నరేశ్, విద్యార్థులు వైద్య బృందం పాల్గొన్నారు.

తీపి రైతులకు చేదు

- పెట్టుబడి ఎక్కువ.. లాభాలు తక్కువ
- పెరిగిన సాగు విస్తీర్ణం
- అందుబాటులో లేని చక్కెర కర్మాగారం
- దళారుల ఇష్టారాజ్యం
- వేధిస్తున్న కూలీల కొరత



జిన్నారంలో చెరుకు తోట (ఇన్‌సెట్లో) లారీలో ఫ్యాక్టరీకి తరలిస్తున్న చెరుకు

తీపిని పంచే రైతుకు చివరకు పిప్పే మిగులుతోంది. సాగు మొదలు.. దిగుబడి చేతికి వచ్చే వరకు ఎన్నో కష్టాల నష్టాలకోర్చి చెమటోడ్చిన కర్షకులకు.. మద్దతు ధర అందని ద్రాక్షగానే మిగిలింది. అంతే కాదు.. స్థానికంగా చక్కెర కర్మాగారం లేక, దూర ప్రాంతాలకు ఉత్పత్తిని తరలించడంతో రవాణా ఖర్చులు భారమై.. రాబడిపై ప్రభావం చూపుతోంది.

బంట్వారం: మండల పరిధి తొర్మామిడి, బస్వాపూర్, బొప్పునారం, కోట్‌పల్లి మండలం జిన్నారంలో అత్యధికంగా చెరుకు పంట సాగవుతోంది. బోరు, బావుల్లో నీటి మట్టం ఎక్కువగా ఉండటంతో సాగు విస్తీర్ణం ఈ సారి పెరిగింది. సుమారు రెండు వేల ఎకరాల్లో పండించారు. కానీ చక్కెర ఫ్యాక్టరీ అందుబాటులో లేకపోవడంతో రైతులకు ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. తొర్మామిడిలోని చక్కెర కర్మాగారం చాలా కాలం క్రితమే మూత పడింది. దీంతో సంగారెడ్డి, కొత్తకోట, కర్ణాటకలోని యాద్గిరి ఫ్యాక్టరీలకు ఉత్పత్తిని తరలిస్తుండటంతో రవాణా ఖర్చులు భారమవుతున్నాయి.

ఎకరాకు మిగిలేది రూ.2,200

ఎకరా చెరుకు సాగుకు రూ.30 వేలు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది సంగారెడ్డి కర్మాగారంలో చెరుకు టన్నుకు ధర రూ.3,750 పలుకుతోంది. గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం టన్నుకు రూ.వంద పెరిగినప్పటికీ.. కూలీల చార్జీలు, రవాణ ఖర్చు పోను రైతుకు చివరకు మిగిలేది టన్నుకు రూ.2,200 మాత్రమే.

తెల్ల చెరుకు పండిస్తే కొనరు

ప్రైవేటు ఫ్యాక్టరీ యాజమాన్యాలు వారికి అనుకూలంగా రైతులతో చెరుకు సాగు చేయిస్తూ.. లాభాలు ఆర్జిస్తున్నట్లు ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగా తెల్ల చెరుకుకు బదులుగా ఎర్ర చెరుకును సాగు చేయిస్తున్నారు. చాలా కాలంగా ఇదే తంతు జరుగుతోంది. ఒక వేళ ఎవరైనా తెల్ల చెరుకు పండిస్తే కొనుగోలు చేయని పరిస్థితి. ఎర్ర చెరుకు తీపి ఎక్కువగా ఉండటంతో చక్కెర ఎక్కువగా వస్తుందని వ్యాపారులు దీనికే కట్టుబడి ఉన్నారు.

తగ్గిన దిగుబడి

భూమిని బట్టి దిగుబడి వస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో నల్ల రేగడి, ఎర్ర నేలల్లో చెరుకు సాగు చేస్తున్నారు. ఎకరాకు 35 టన్నులు రావాల్సి ఉండగా.. 25 టన్నులకు దిగుబడి పడిపోయింది. పెట్టుబడులు ఇతరత్రా ఖర్చులు పోను, ఎకరాకు రూ.20 వేలు మిగిలితే ఎక్కువేనని చెరుకు రైతులు పేర్కొంటున్నారు.

'ఉపాధి'లో అనుసంధానం చేయాలి



ఇక్కడ ప్రధాన పంటగా భావించే చెరుకును ఉపాధి హామీలో అనుసంధానం చేయాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. కూలీల సమస్య తీవ్రంగా ఉంది. చక్కెర ఫ్యాక్టరీ అందుబాటులో లేదు. సంగారెడ్డి ఫ్యాక్టరీకి తీసుకెళ్తే రవాణా ఖర్చులు అధికం అవుతున్నాయి. కర్ణాటక మాదిరిగా.. సంగారెడ్డి యాజమాన్యం లేబర్‌ను సమకూర్చాలి. చెరుకు కటింగ్ సీజన్‌లో దూర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకు రావాల్సి వస్తుంది.

– మోహన్‌రెడ్డి, రైతు, బస్వాపూర్

టన్నుకు రూ.6 వేలు చెల్లించాలి



చెరుకు టన్నుకు రూ.6 వేలు మద్దతు ధర ప్రకటించాలి. సంగారెడ్డి కర్మాగారంలో దళారులదే శాసనం. యాజమాన్యం రైతులకు సకాలంలో పర్మిట్లు ఇవ్వడం లేదు. మధ్యవర్తులు చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తోంది. వికారాబాద్ ప్రాంతంలో ప్రభుత్వం చక్కెర కర్మాగారం ఏర్పాటు చేయాలి. కనీస మద్దతు ధరను నిర్ణయించి, కొనుగోలు చేసి, రైతులకు లబ్ధి చేకూర్చాలి.

– మర్రి రాజిరెడ్డి, రైతు, సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

దుమ్ముధూళితో ఉక్కిరిబిక్కిరి

- రహదారి పనులు పూర్తిం చేయించండి..
- అగ్గనూరు గ్రామస్తుల రాస్తారోకో

యాలాల: 'దుమ్ముధూళితో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాం. రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయించాలి' అని అగ్గనూరు గ్రామస్తులు సోమవారం సుమారు గంటపాటు రాస్తారోకో చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అగ్గనూరు నుంచి బషీరాబాద్ మార్గంలో రోడ్డు విస్తరణ పనులను ఆరు నెలల క్రితం ప్రారంభించారు. అయితే నిర్మాణ పనులను సదరు కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశాడు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలతో గాలిలో దుమ్ము లేచి, వెనుక వస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్నత పాఠశాల ఉండటం, దుమ్ము పాఠశాల గదుల్లోకి పారడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో విసుగు చెందిన ప్రజలు.. సర్పంచ్ భీమప్పతో కలిసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. ధర్నా స్థలికి వచ్చి, ప్రజలకు నచ్చజెప్పి, నిరసనను విరమింపజేశారు. పది రోజుల్లోగా రహదారి విస్తరణపనులు పూర్తి చేయకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.



నిరసనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

ఏఎన్ఎంలకు వేతనాలు చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు తదితరులు

అనంతగిరి: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు వెంటనే వేతనాలు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 6 నెలలు గడుస్తున్నా వేతనాలు రాక ఏఎన్ఎంలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని జీతాలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శివరాంనాయక్, ఏఎన్ఎంలు చిన్నమ్మ, స్వప్న, లక్ష్మి, సతిబాయి, సబిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోండి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

దోమ: ప్రభుత్వ పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సోమలింగం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.దశరథ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వాలు వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం అనేక చట్టాలను తీసుకువచ్చాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, సీనియర్ నేతలు యాదవరెడ్డి, రమేశ్‌గౌడ్, బంగ్ల యాదయ్య గౌడ్, జిల్లా మహిళా విభాగం కన్వీనర్ సావిత్రమ్మ, మండల అధ్యక్షుడు ఆనంద్, మండల కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు వెంకటయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం

మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఐదేళ్లుగా పని చేశానని అజీజ్‌నగర్ సర్పంచ్ బండ్లగూడ సంధ్య అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ జీపీ కార్యాలయంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులను, సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. సర్పంచ్ పదవీ బుధవారంతో ముగియనుందన్నారు. ఐదేళ్లపాటు అందరితో కలిసి రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పని చేశామన్నారు.

ఎరువుల లెక్క పక్కాగా ఉండాలి

మండల వ్యవసాయ అధికారి మధుసూదన్



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ మధుసూదన్

కొందుర్గు: ఎరువుల లెక్క పక్కాగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ సూచించారు. సోమవారం ఆయన డిప్యూటీ తహసీల్దార్ కృష్ణయ్యతో కలిసి రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలోని శ్రీరంగాపూర్, రామచంద్రాపూర్, కొందుర్గు గ్రామాల్లో పర్యటించి, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల స్టాకు, సేల్ రికార్డులు, బిల్ బుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న భూమి.. అవసరం మేరకే ఎరువులను విక్రయించాలన్నారు. ప్రతీ రైతుకు బిల్లు ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్టాకు వివరాలు పొందుపరచాలన్నారు. ఎరువులు పక్కదారి పడితే సహించేది లేదన్నారు. పట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేటి నుంచి వజ్రోత్సవ వేడుకలు

కొడంగల్ రూరల్: శ్రీ గీతా జ్ఞాన గురుభక్త మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 75వ (వజ్రోత్సవ) మహోత్సవాలను జయప్రదం చేయాలని శ్రీ జగద్గురు రామ బ్రహ్మానంద స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుద్యాల మండలం చిల్‌ముల్‌మైలారం గ్రామంలో సీమ వారి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు శాంతి యజ్ఞం, గీతా యజ్ఞం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

పీఈటీకి సన్మానం



గౌరి శంకర్‌కు సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

పెద్దేముల్: ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ విరమణ తప్పదని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలల్లో పీఈటీగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన గౌరి శంకర్‌ను సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు పీఈటీలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పీఈటీగా గౌరీ శంకర్ మండల స్థాయి విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. ప్రభుత్వం ప్రతి ఉన్నత పాఠశాలకు పీడీ, పీఈటీలను నియమించాలని పీఈటీలు కోరారు. కార్యక్రమంలో తాండూరు, బషీరాబాద్, యాలాల, పీడీ, పీఈటీలు రాధాకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, రాజు, రాజశేఖర్ రెడ్డి, అంబదాస్, విజయ భాస్కర్, సుధాకర్, వెంకట్, వెంకటేశ్, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గోపిక, భాగ్యలక్ష్మి, జ్యోతి, మధు, మైపాల్, అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

డీటీ సేవలు అభినందనీయం



డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌ను సన్మానిస్తున్న రత్నమ్మ తదితరులు

కుల్కచర్ల: డిప్యూటీ తహసీల్దార్ రమేష్ సేవలు అభినందనీయమని కుల్కచర్ల సొసైటీ డైరెక్టర్ రత్నమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రం తహసీల్ కార్యాలయంలో డీటీ రమేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా.. ఇబ్బంది పడకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడం హర్షించదగిన విషయమన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆనంద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: విద్యార్థులను కష్టంతో కాకుండా ఇష్టంగా చదివించాలని, అప్పుడే వారు ఉన్నత స్థితికి చేరుకుంటారని డీసీసీ ఉపాధ్యక్షుడు బొలుసాని బీంరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం కుల్కచర్ల మండలం కుస్మసముద్రం ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బీంరెడ్డి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతికి భరత్ కృషి చేయడం అభినందనీయమని, విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని, పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పాఠశాల చైర్మన్ చెన్నయ్య, గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యం, బాబు, శ్రీరాం, సాయన్న, కొండయ్య, రాఘవేందర్, బాలకృష్ణ, ఎండీ. షరీఫ్, ఎండీ సాజిజ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. అధైర్యపడొద్దు

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఉత్తరాసిపల్లిలో మాట్లాడుతున్న అంజయ్యయాదవ్

కొందుర్గు: కార్యకర్తలు అధైర్యపడవద్దని, ఏ ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ భరోసానిచ్చారు. సోమవారం ఆయన మండల పరిధిలోని అయోధ్యాపూర్‌తండా, చిన్నఎల్కిచర్ల, పులుసుమామిడి, పర్వతాపూర్, మహదేవ్‌పూర్, బైరంపల్లి, ఉత్తరాసిపల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి, లాలపేట, ఉమ్మెంత్యాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా బీఆర్ఎస్ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెప్రగతితో గ్రామాల్లో వెలుగులు

షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులతో గ్రామాల్లో కొత్త శోభ సంతరించుకుందని రంగారెడ్డి జిల్లా షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని చర్లగూడలో సర్పంచ్ పుష్పమ్మతో కలిపి గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. పల్లెప్రగతిలో నిర్మించిన వైకుంఠ ధామం, క్రీడాప్రాంగణం అందుబాటులోకి తీసుకువచ్చామని గుర్తు చేశారు. గ్రామంలోని అన్ని కాలనీలకు సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్ వెంకటయ్య, ఎంపీటీసీ మధూకర్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి తదితరులున్నారు.



షాబాద్: చర్లగూడ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

అభివృద్ధి చేసి చూపాం: సర్పంచ్ రాజు

మొయినాబాద్: గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని అప్పోజిగూడ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నారు. అప్పోజిగూడలో ఎన్‌ఆర్‌ఈజీఎస్, జీపీ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీని ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అభివృద్ధికి అవసరమైన నిధులను రాబట్టామన్నారు. మండలంలో కొత్తగా ఏర్పడిన ఏడు గ్రామ పంచాయతీల్లో నూతన పంచాయతీ భవనం నిర్మించింది అప్పోజిగూడలోనే అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేశ్, వార్డు సభ్యులు హరిత, రాజు, సంధ్య, లత, స్వర్ణలత, కృష్ణ, కోఆప్షన్ సభ్యులు కృష్ణారెడ్డి, వీరేష్, పద్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

మోమిన్‌పేట: టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం మండల విద్యాధికారి గోపాల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. నేటి బాలలను రేపటి మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి పరమేశ్, జిల్లా అధ్యక్షుడు రత్నం, ఉపాధ్యాయుడు బాబురావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు మహేందర్‌రెడ్డి, సురేందర్, మహంత్‌స్వామి, సిరాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గోపాల్ తదితరులు

ప్రజా సేవకులుగా పనిచేద్దాం

- ఐకమత్యంతో అభివృద్ధిని సాధిద్దాం
- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సేవలకులుగా పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్ అహ్మద్ ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో పాల్గొని తమ గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత లేక ఎన్నో కష్టాలు చవిచూశారన్నారు. కేసీఆర్ పాలనలో స్థానిక ప్రజాప్రతినిధులకు స్వేచ్ఛ లేదని అబద్రతా భావంతో ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా.. సర్పంచులు సొంత ఖర్చులతో మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేశారన్నారు. సర్పంచ్‌లకు చేసిన పనుల నిధులు మంజూరవ్వక ఇబ్బదులు పడుతున్నారని, సర్పంచ్‌ల బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు రాజకీయ కక్షలకు, ఆధిపత్య పోరుకు దూరంగా ఉండాలని చెప్పారు. గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఐకమత్యంతో అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సదరం క్యాంపులను నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటుచేసేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అయన స్థానిక అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, వైస్ ఎంపీపీ మానిక మచ్చేందర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బక్కని యాదవ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, తహసీల్దార్ పార్థసారధి, మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, ఏపీఎం నగేష్, ఏపీఓ అరుణ, ఎంపీఓ గిరిరాజ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో నూతనంగా నిర్మించిన పశువైద్య కేంద్రం ప్రారంభంతో పాటు పార్టీ జెండా ఆవిష్కరణ, కుందేలు కుంటతండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. పంచాయతీల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. పల్లెల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అరుణ శివకుమార్, రవీందర్‌నాయక్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్ల శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే

షాద్‌నగర్: మండల పరిధిలోని రామేశ్వర దేవాలయం నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శానికి పార్టీవేత్త బండ్ల శివబాబు ఆధ్వర్యంలో సోమవారం భక్తులు పాదయాత్రను చేపట్టారు. ఈ పాదయాత్రను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రామేశ్వరంలో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుమార్‌గౌడ్, అంజియాదవ్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.